# అక్రమం

## పాలడుగు వెంకటేశ్వరరావు



ఈ ప్రపంచంలో అకారణంగా ఒక మంచి మనిషి ఎందుకు హింసించబడతాడో ఈనాటికీ నాకర్థంకాదు. సూర్నాణా నేనూ 'రూము మేట్సు'మి. ఇద్దరం రిటయిర్మెంట్‌కి దగ్గరలో పడ్డాము. మా ఇద్దరి వయస్సులూ దాదాపు ఒకటిగా వుండటం... ప్రాజెక్టు కాలనీలో నాకు క్వార్టరు దొరక్కపోవటం, అతని క్వార్టరులో సూర్నాణ వంటరిగా వుండటం, కంపెనీ కోసం, నేను అడగ్గానే అతను సరేననటం వలన – గత ఆరు మాసాలుగా మేము రూము మేట్సుమి అయ్యాము, అలాగ. సూర్నాణ ఇంటిని ఎప్పుడూ చాలా నీటుగా పెట్టుకుంటాడు. సూర్నాణ ఎక్కువ మాట్లాడడు. ఎవరన్నా మాట్లాడితే ఓపిగ్గా వింటాడు.

నేను ఎక్కువగా మాట్లాడతాను. అది నా అలవాటు. అందు వలన నా మాటల్ని వినటం అతనికి అలవాటయింది. స్వతహాగా సూర్నాణ శాంతమూర్తి. నాకు బీ.పీ. వుంది.

సూర్నాణ చాలా మంచివాడు. మనసా వాచా కర్మణా ఎవరి మనస్సునూ నొప్పించని స్వభావం అతనిది. రోజూ ఉదయాన్నే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, చన్నీట తృప్తిగా స్నానం చేసి, పూజాదికాలు పూర్తయ్యాక, నాకోసమని బాయిలర్ వెలిగించేవాడు. కూనిరాగాలు తీస్తూ భక్తిగీతాలు పాడుకుంటూ అతను వంట ప్రయత్నంలో వుండగా – నేను నిద్ర లేచేవాణ్ని. అతని వంట పూర్తయ్యే లోపల నా స్నానాదులు పూర్తి చేసుకుని తయారయ్యేవాణ్ని. అప్పటికి ఆఫీసు టయిమవటంతో – ఇద్దరం చెరో దార్నీ ఆఫీసులకి వెళ్ళేవాళ్ళము. అతను సైకిలేసుకుని వెళ్ళేవాడు. నేను 'సువేగా' మీద వెళ్ళేవాణ్ని. సైకిలు సూర్నాణకి ఆరో ప్రాణం.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే – తన పన్లు తాను చేసుకుని వీలునుబట్టి ఎదటివాడికి అంతో ఇంతో సాయంచేసే తత్త్వం సూర్నాణది. మనిషి చాలా సహృదయుడు మెతక స్వభావం. సౌమ్యుడు. ఇటువంటి పెద్దమనిషి – రాత్రుళ్ళు బాగా పొద్దుపోయే వరకూ నిద్ర పోయేవాడు కాదు. శరీరాన్ని అలా మంచంమీద పడేసినా – కళ్ళు తెరుచుకుని పైకి చూస్తూ వుండేవాడు. నేనూ మెలకువగానే వున్న సమయాల్లో – లోగొంతులో హనుమాన్ చాలీసా – అష్టపదులూ, రామదాసు కీర్తనలూ – మృదుమధురంగా పాడేవాడు. నేను నిద్రలోకి జారుకున్నానని అనుమానం వచ్చినపుడు–ఆ పాటల్ని ఆపేసి పైకి చూస్తూ వుండేవాడు. చీమకయినా నల్లికయినా హాని తలపెట్టని తత్త్వం – అది.

"గురూగారూ! ఎందుకండీ, వంటరిగా అయిపోయారు? ఏమిటి తోడులేని మీ కథ?" అని అడిగాను. ఒకసారి, సూర్నాణని, మాటల సందర్భంలో.

సూర్నాణ నవ్వి శూన్యంలోకి చూశాడు, నిట్టూర్పుగా

వదుల్తా.

కాస్సేపు అలా చూసి, నేను మరలా రెక్కించగా—అప్పుడు చెప్పాడు.

అతనికి ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె. కూతురు పెళ్ళి చేసాడు. ఆమె రాజమండ్రిలో భర్తతో వుంటుంది. పెద్దకొడుకు ఇక్కడే ఈ ప్రాజెక్టులోనే జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. రెండవవాడు, ఎస్.ఎస్.సి. మూడుసార్లు తప్పి ఇంక చదువు మానేసాడు. చెప్పినమాట వినడు. ఎదురు తిరిగి మాట్లాడుతాడు. చెడు స్నేహాలు ఎక్కువ. ఇంటిపట్టున వుండడు. వూళ్ళు పట్టుకుని తిరుగుతాడు. జల్సారాయుడు."

"పాపం! మీ భార్య మీ దగ్గర ఎందుకు వుండదు?"

"పుట్టింటి దగ్గర వుంది. నిక్షేపంగా వుంది! గుబులు మళ్ళితే వస్తుంది నా దగ్గరకి. లేకపోతే లేదు.

"మరి ఎన్నాళ్ళని మరొకరి పంచిన పడివుంటుందామె?"

"క్రాక్! తన ఇష్టం" అంతకుమించి అతన్నుంచి సమాధానం రాలేదు. అతని కనుకొలకులలో నీరూరింది. అందువలన - నేను ఆ విషయాన్ని అక్కడితో త్రుంచేసాను. బాధపడుతున్న పెద్దమనిషిని మరింత రెక్కించటం భావ్యం కాదు.

ఒకరోజు ఆఫీసునుంచి రాగానే సూర్నాణ చెప్పాడు, నాతో. "తన దగ్గర్నుంచి నాకు ఉత్తరం వచ్చింది" - ఎంతో హుషారు కనపడింది అతని మాటల్లో.

"అలాగా! ఏమిటి విశేషం!" అని అడిగాను, చిరునవ్వు నవ్వి.

"మా యావిడ వస్తున్నట్లుగా ఉత్తరం రాసింది" అన్నాడు. "రెండోవాడూ వస్తున్నాట్ట."

సూర్నాణ గొంతుకలో సంతోషం. అతని మొహం నిండా ఆనందం. నాకూ ఎంతో ఆనందం అన్పించింది. కంగ్రాట్సు చెప్పాను. ఆ సాయంత్రమే నేను నా మకాం మరో ఫ్రెండ్ ఇంటికి మార్చాను.

నాలుగు రోజుల తర్వాత - నీర్సంగా సైకిల్ని నడిపించుకుని వస్తూ ఎదురయాడు సూర్నాణ బజార్లో. చెంపలు లోతుకు పోయి నీర్సంగా నిస్త్రాణగా కనిపించాడు.

"గురూగారూ! కులాసాగా వున్నారా?" అని పల్కరించాను.

"ఆ-ఆదే కులాసాలెండి" అని నీర్సంగా అన్నాడు సూర్నాణ.

"అదేం అలా అయిపోయారు? వంట్లో బాగాలేదా?"

"వంట్లో బాగానే వుందిలెండి. మనసే బావులేదు. వాళ్లు వచ్చారుగా-"

"ఏం? ఏమయిందండీ?"

సూర్నాణ చెప్పాడు.

"భార్య చిన్న కొడుకుతో వచ్చి తిష్ట వేసినప్పట్నుంచీ యధా ప్రకారం గృహకల్లోలం ప్రారంభమయిందిట. కొడుక్కి డబ్బు కావాలట. తన దగ్గర వున్నది తీసిఇచ్చాడుట. అది చాలదని మూర్ఖంగా పోట్లాట. అప్పో సప్పో చేసి ఇస్తావా చస్తావా అని కొడుకు గొంతు పట్టుకున్నంత పనిచేసాడట. దానికి భార్య వంత పాడిందట. ప్రతిపూటా గొడవ గొడవ."

"పోనీ మీకు కావాలంటే నా దగ్గర తీసుకోండి. తర్వాత మెల్లిగా ఇద్దురుగాని ఎంత కావాలి" అన్నాను, సస్నేహంగా.

"వాడికి ఎంత ఇచ్చినా చాలదు" నిట్టూర్చాడు.

"ఏం చేస్తాడు ఈ డబ్బుతో?"

"తగలేస్తాడు. అందుకే చాలదు. ఎంత ఇచ్చినా చాలదు"

"అదేం పని?!"

"కర్మ!" అని తల పట్టుకుని నిట్టూర్చాడు సూరాణ. అతనికి ధైర్యం చెప్పి - అప్పటికప్పుడు నా దగ్గరున్నది ఒక వెయ్యి రూపాయలు ఇచ్చాను. సంతోషంగా తీసుకుని వెళ్ళిపోయాడు సూర్నాణ—థాంక్సు చెప్పి.

ఆ తర్వాత పదిరోజులకి నా దగ్గరకే పని గట్టుకుని వచ్చాడు సూర్నాణ ఒకనాడు. సూర్నాణ ఎంతో హుషారుగా వున్నాడు. చూపులలో ఇదివరకటి కళాకాంతులు తిరిగి వచ్చాయి.

"ఏమిటి గురూగారూ! శుభవార్తా? రండి రండి" ఆహ్వానం పలికాను.

"ఏదోలెండి. మీరు మన ఇంటికి మకాం మార్చండి తక్షణం. ఆజెప్పటానికే-"

"ఏమిటి? ఏమయింది?"

"వాళ్ళిద్దరూ గొడవపెట్టుకుని నాతో పోట్లాడి వెళ్ళిపోయారు."

"అదేం!? నా దగ్గర పట్టుకెళ్ళిన వెయ్యి రూపాయలూ ఇవ్వలేదా మీరు?"

"ఇచ్చాను. అది చాలదని గొడవ చేసారు. పోట్లాటయింది."

వాళ్ళ పోట్లాటంటే అది ఎటువంటిదో అతని పక్కింటి పున్నారావు ద్వారా నాకు ఇదివరకే తెలిసింది. అంతా వన్ సయిడెడ్! ఆ తల్లీ కొడుకులు ఆ వున్న నాల్గు దినాలూ సూర్నాణని రాచిరంపాన పెట్టారు. అతనికి మనశ్శాంతి అన్నది లేకుండా చేశారు. అతని దగ్గర వున్న డబ్బూ, అప్పుచేసి తెచ్చినదీ వూడలాగుకుని, గొడవచేసి గాజు సామాన్లు బ్రద్దలుగొట్టి, కుర్చీలూ బల్లలూ గిరాటేసి....ఒక ఫానూ, గడియారమూ పట్టుకుని చక్కా పోయారు-అని వార్త.

కొన్ని కొన్ని పనులు చూడటానికి 'రీజనబుల్'గా అనిపించవు. ఎంతగా వెదికినా వాటికి కారణాలు కానరావు.

"అదేం? ఎందుకలా జరిగింది?" అన్నాను; కోపాన్ని అణుచుకుంటూ నేను.

"కర్మ"

నాలుగు నిముషాలు ఇద్దరం మవునం పాటించాము.

"వెంటనే మీరు మన ఇంటికి మకాం మార్చండి" అన్నాడు సూర్నాణ మళ్ళీ.

తోడుకోసం తాపత్రయం, ఆత్మీయత నిండిన విచిత్ర బంధం.

"వాళ్ళిద్దరూ మరల తిరిగి వస్తేనో!" అన్నాను. నా అనుమానం నాదీ.

"ఇప్పుడప్పుడే ఏం రారు. మీకా భయం అక్కరలేదు". అన్నాడు సూర్నాణ.

ఆ సాయంత్రమే దగ్గరుండి మకాం మార్పించాడు, నాచేత సూర్నాణ.

వాళ్ళు వున్న పది రోజులలో ఆ ఇంట్లో ఎంత విధ్వంసకాండ జరిగిందో కళ్ళారా చూసాక నాకు అవగతమయింది. సాధిజం వుంటుంది. దానికి మంచితనాన్నీ, మెతకదనాన్నీ చూస్తే మహా లోకువ. అది పేట్రేగటాన్కి కారణాలక్కర్లేదు.

"గురూగారూ! ఇట్లా అయితే లాభంలేదు." అన్నాను. పళ్ళు కొరుకుతూ కోపంగా.

"ఏం?" అన్నాడు సూర్నాణ వేదాంతిలాగ.

"మీరు కరుకు బారాలి. ఎదిరించి నిలబడాలి. మీకు అర్థం కాలేదా?"

"అర్థమయిందిలే. ఏం లాభం?"

"అదేమిటి?"

"అది అంతే. వాళ్ళు క్రాక్స్. ఎప్పుడూ ఇంతే. నన్ను బాధించటమే వాళ్ళ ధ్యేయం."

"అటువంటప్పుడు మీరు ధైర్యంగా ఆ బంధాన్ని త్రెంచేసుకోవాలి!"

"ఎలా తెంచుకొనేది? సాధ్యమయ్యేదేనా? బ్రహ్మచార్లు గనుక మీకు తెలీదు"

"ఏం ఎందుకు కాదూ?"

"తను తాళి కట్టిన ఇల్లాలు. వాడు నా కొడుకు. రక్త సంబంధం గద. ఇది తప్పేది కాదు. త్రెంచుకొనగలిగినదీ లేదు. ఇది ఇంతే"

ఒకరోజు వంట చేసుకుంటూ-కాలు జారి పడ్డాడు సూర్నాణ. కాలు బెణికింది. నాల్గు రోజులు బాధపడ్డాడు. అయ్యో! అన్పించింది నాకు.

"మీకు ఈ వయస్సులో ఇంకా ఈ బాదరబందీ ఎందుకండీ?" అని అడిగాను.

"ఏం చెయ్యను?"

"నాలాగా హోటల్లో తినండి"

"అది నాకు పడదు. అలవాటు లేదు"


# గెలవండి. రూ. 1,75,000/- విలువ గల బహుమతులు

## ఎంట్రీ రుసుము లేదు.

| | | |
|---|---|---|
| 16 | 21 | 14 |
| 15 | 17 | 19 |
| 20 | 13 | 18 |

మొదటి బహుమతి: కలర్ టి. వి. లేదా రు. 10000 నగదు

కన్సొలేషన్ బహుమతి: అధునాతన ఇంపోర్టెడ్ జపాన్ మోడల్ టూ - ఇన్ - వన్ రు. 240/- లకే. మా చెయిన్‌లింక్ స్కీము ద్వారా పొందవచ్చును. 12 నుండి 20 వరకు గల అంకెలు వుపయోగించి

| | | |
|---|---|---|
| 15 | | |
| | 16 | |
| | | 17 |


అడ్డంగా / నిలువుగా / మూలలుగా, ఎటు కూడినా 48 వచ్చేటట్లు పైగళ్లు నింపండి.

ఒక అంకె ఒకసారి మాత్రమే వుపయోగించాలి.

మీ ఎంట్రీలు 15 రోజులలో పంపండి.

**GOOD LUCK Co., (BH)**

**136, New Layalpur, Delhi - 51**







"పోనీ పెద్దకొడుకు వూళ్ళోనే వుంటున్నాడు గదా! అక్కడ తిని రారాదూ?"

"అదీ అయిందిలెండి" అని నిట్టూర్చాడు. "కట్టుకున్నదానికే లేదు. ఇతర్ల కెందుకుంటుంది?"

"ఏమయిందీ?"

సూర్నాణ చెప్పాడు. అతని గుండెల్లో బాధ గొంతులో తొంగి చూసింది.

"చేతులు కాల్చుకొనటం కష్టమనిపించి ఆ మధ్యన కొడుకుని అడిగితే సరే వచ్చి తినమన్నాడట. నెలకు నాల్గువందలు ఇమ్మన్నాడట. సరేనని అట్లాగే చేసాడట సూర్నాణ. కానీ - డబ్బులు పుచ్చుకున్నా కూడా సరిగా పెట్టేవాళ్ళు కాదట. మాడు అన్నమూ, వాసన గొట్టే చారూ, నీళ్ళ మజ్జిగా పెట్టేదట కోడలు. ఎలాగో కృష్ణా-రామా అనుకుని సరిపెట్టుకొనేవాడట సూర్నాణ. రెండు నెలలు అలా పెట్టి - వచ్చిన జీతమంతా చేతుల్లో బోస్తేగాని కుదరదని మొహం మీదే అని - తగిలేసేరట.

"కృతజ్ఞతన్నా లేదు! ఎందుకండీ ఈ కొడుకులూ?" అని కోపంగా అన్నాను.

సూర్నాణ నవ్వాడు. "కాస్త కోపం తగ్గించండి సారూ" అన్నాడు.

"వీళ్ళకి కొంచెమయినా మానం, అభిమానం, మానవత్వం లేక పోతే ఎట్లా?"

"ఈ రోజులు అట్లా వున్నయి! ఏం చేస్తాం?" అని భగవద్గీత లోని ఒక శ్లోకాన్ని చదివాడు సూర్నాణ. సరిపెట్టుకొనక తప్పదు- అని దాని అర్థం.

"ఉద్యోగం వుండి నెలనెలా నాల్గురాళ్ళు వచ్చి, కాలూ చెయ్యీ ఆడినంతకాలం ఏదో ఇలాగ కాలక్షేపం చేస్తారనుకుందాం మరి ఆ తర్వాత ఎలాగండీ? ఆలోచించారా సూర్నాణగారూ?" అన్నాను.

"అది మాత్రం ఇంకెన్నాళ్ళులెండి, రెండేళ్ళలో రిటయిరయి పోతాను, యాభయిఎనిమిది నిండుతుంది."

"అదే. అప్పుడెట్లాగని?"– నా ప్రశ్నలో భయం, ఆదుర్దా నిండివున్నయి.

సూర్నాణ నవ్వాడు. "తోడూ నీడా కావాలి గదా మనిషికి ఆ పరిస్థితిలో!" అన్నాను.

"ఒక మంచి మనిషి జీవితం ఇట్లా ఛిన్నాభిన్నమయి నరక ప్రాయంగా క్రూరంగా ఎందుకు అవుతుందో తల బ్రద్దలు గొట్టుకున్నా నాకు అర్థంగాదు." కసిగా ఆవేశంగా అన్నాను.

సూర్నాణ నావంక జాలిగా, దయగా, ఆర్ద్రంగా చూసాడు. స్నేహంగా నవ్వాడు.

"మరి రిటయిరయిపోయాక ఏం చేద్దామనుకుంటున్నారో నాకు చెప్పారు కారు" మళ్ళీ అడగ్గా, సూర్నాణ నవ్వి, పైకి చూసి నమస్కారం చేసాడు.

ఎట్లా చూద్దామన్నా సూర్నాణ జీవితం నాకు ఒక పజిల్‌లాగా అనిపించింది. కొన్ని కొన్ని యదార్థాలు అవాస్తవికంగా నమ్మశక్యం కానివిగా అనిపిస్తాయి. కాని - కళ్ళ ఎదుటే జరుగుతున్నా నమ్మకుండా వుండటం ఎట్లాగో నాకు అర్థం కావటం లేదు.

ఆ రోజు సాయంత్రం నేను ఆఫీసునుండి ఆలస్యంగా ఇంటికి వచ్చాను. షోకుగా పాంటూ, బుష్ షర్టూ ధరించిన ముప్ఫయి సంవత్సరాల యువకుడు ఇల్లంతా కలియ దిరుగుతూ, గట్టిగా కేకలు పెడుతున్నాడు. అతణ్ని సూర్నాణ పెద్ద కొడుకుగా నేను గుర్తు పట్టాను. నన్ను చూసి అతను కేకలు ఆపి - సూర్నాణ ప్రాణ ప్రదంగా చూసుకుంటున్న సైకిల్ని తీసుకుని వెళ్ళిపోయాడు— సూర్నాణ చూస్తూ వుండగానే.

"సూర్నాణగారూ! మీ అబ్బాయి వచ్చినట్లున్నాడు" పలకరించాను.

# విత్తనం

శిశిరోత్సవానికి జిల్లేడు చెట్టు
కజ్జికాయల పిండి వంట చేస్తుంది.

సూర్యుడు కరకరలాడే ఆకలితో
జిల్లేడు కాయల పొట్టలు చీల్చి
వళ్లెంలో పాల బువ్వని చిన్న పిల్లాడిలా
విరజిమ్ముతాడు.
వెయ్యి నల్లటి విభక్త ప్రాణులు
సూర్య శిశువుల్లా
తెల్లటి మెత్తటి సిల్కు రెక్కలు విదిల్చి
జీవయాత్ర ప్రారంభిస్తాయి.
గాలి అలల్లో తేలుతూ మునుగుతూ
స్వచ్ఛంగా అమాయకంగా దిక్కులు చూస్తూ
ఓ నల్లటి కనుపాప
ఇల్లు విడిచి దేశాటనకి
బయల్దేరిన వంశాంకురంలా
తిరుగుతుంది.

దాని పాదాల కింద
ఊళ్లూ చీళ్లూ గడిచిపోతాయి.

తిరిగి తిరిగి అలసిపోయి
మెత్తటి భూమి ఒడిలో దిగుతుంది.
అదే తల్లి పుట్టిల్లే అని తెలిసి
సంతృప్తిగా రెక్కలు రాల్చేసి
నిశ్చింతగా నిద్రపోతుంది.

వరుణదేవుడి కరుణలా కురిసే వాన
మరిచి పోతున్న ప్రాణాన్ని నిద్ర లేపి

చెట్టంత బాధ్యత తలకెత్తుతుంది.

మరో కొత్త అందం మొలకెత్తుతుంది.
రెండు లేత చేతులెత్తి
ప్రాణదాత సూర్యుడికి
ప్రణమిల్లుతుంది.

శ్రీ కె. గోదావరిశర్మ

"సెలవు పెట్టి వూరెళ్ళి నిన్ననే తిరిగి వచ్చాడట" - అన్నాడు సూర్నాణ తాపీగా.

"ఏమిటి? ఏదో గొడవ జరుగుతున్నట్లు వుంది? ఏమంటాడు జ్యేష్ఠపుత్రుడు"

"గొడవేముంది?" వాళ్ళు ఫానూ, గడియారం పట్టుకుపోయారట గదా! పిల్లలు గలవాడ్ని. మరి నా సంగతి ఏమిటి?" అని చిందులు వేసాడు. నానా అల్లరి చేసి సైకిలు తీసుకుని పోయాడు. నాకు వాళ్ళంటే పక్షపాతం అట!"

"రామ! రామ! వీళ్ళు మీ మానాన్న మిమ్మల్ని బ్రతకనివ్వరా సూర్నాణగారూ! నేను వెళ్ళి నాలుగూ దులిపి ఆ సైకిలు తీసుకురానా? ఏం మనుషులు?!"

"వద్దులెండి"

"అదేమిటి సూర్నాణగారూ"

"తీసుకోనివ్వండి. వాడెవరు? నా కొడుకేగదా? పరాయి వాడు కాదు గద"

"మరి మీకెలాగా?"

"ఎలాగో అలాగ! పైన భగవంతుడున్నాడులెండి. "ఆఫీసుకి నడిచి వెళ్తానులే"

"సూర్నాణా! ఇది అన్యాయం నేను సహించలేను." కోపంగా అన్నాను. గంతులేశాను.

"గురూగారూ! మీరు వూరుకోండి" అని దణ్ణం పెట్టాడు సూర్నాణ.

ఆ రోజు ఇక మా మధ్యన మాటలు లేవు. అతన్ని చూస్తే నా కసహ్యంగా కోపంగా వుంది. అతని జీవితం దుర్భరంగా అక్రమంగా అన్పించసాగింది.

హోటల్లో భోజనం చేసి ఫ్రెండ్స్ దగ్గరకి వెళ్ళి కాలక్షేపం చేసి అర్ధరాత్రి నేను ఇల్లు చేరేసరికి సూర్నాణ తన మంచంమీద పడుకుని వున్నాడు మవునంగా.

మర్నాడు ఉదయం ఎనిమిదింటికి బద్ధకంగా కన్నులు తెరిచాను. మామూలుగా నేను వినాల్సిన చప్పుళ్ళు సూర్నాణ గొంతు నుండి లోస్వరంలో వినవచ్చే భక్తిగీతాలూ - వినరాలేదు, ఏమిటా అని వత్తిగిల్లి చూశాను ఆశ్చర్యంగా.

సూర్నాణ ఇంకా వెల్లకిలా మంచంమీద పడుకునే వున్నాడు!

"సూర్నాణగారూ! సూర్నాణగారూ! ఏమిటండీ? ఇంకా లేవలేదు. వంట్లో బాగాలేదా?" అంటూ లేచి అతని దగ్గరికి వెళ్ళి మీద చెయ్యి వేసాను.

సూర్నాణ శరీరం చల్లగా, నిశ్చేతనంగా తగిలింది!